సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 18 । నవంబర్ । 2024



'కమర్షియల్'గా వాడేస్తున్నారు
రవాణా వాహనాలకు పసుపు రంగు నంబర్ ప్లేట్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. కొందరు తెలుపు రంగు నంబర్ ప్లేట్ వాహనాలను వినియోగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 8లో



క్రీడలతో ఆత్మస్థైర్యం మెండు
భీమడోలు మండలం పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో జోన్ 2 బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. 8లో



మొక్కజొన్న సాగుకు ఇదే అదును
రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటను విత్తుకోవడానికి ఇదే సరైన సమయమని, లోతైన ఎర్ర గరప, మధ్యస్థ నేలలు అనుకూలమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి దళిత వాడల్లో శ్రీవారి ధర్మప్రచారం



ద్వారకాతిరుమల : శ్రీవారి ధర్మప్రచార రథం సోమవారం నుంచి దళిత వాడల్లో పర్యటించనుందని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ద్వారకాతిరుమలతో పాటు జంగారెడ్డిగూడెం మండలంలోని 8 గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ధర్మప్రచారాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 8 గంటలకు ఆలయ జంటగోపురాల వద్ద ఈ ధర్మప్రచార రథయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.

జోనల్ బ్యాండ్ పోటీల్లో ప్రథమం



జోనల్ బ్యాండ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన గురుకుల పాఠశాల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: కర్ణాటక రాష్ట్రం దావణగిరిలో జరిగిన జోనల్ స్థాయి స్కూల్ బ్యాండ్ పోటీల్లో మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల బ్యాండ్ టీమ్ ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ విషయాన్ని ఆదివారం స్కూలు ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. మొత్తం ఎనిమిది రాష్ట్రాల నుంచి 33 టీంలు పాల్గొనగా, తమ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని చెప్పారు. విద్యార్థులకు కర్ణాటక మంత్రి ఎస్ఎస్.మల్లిఖార్జున్, ఎంపీ ప్రభా మల్లికార్జున్ తదితరులు బహుమతి ప్రదానం చేశారన్నారు. న్యూఢిల్లీలో 2025 ఫిబ్రవరిలో జరగనున్న గణతంత్ర దినోత్సవ సాంస్కృతిక వారోత్సవాల్లో తమ విద్యార్థులు పాల్గొంటారని ప్రిన్సిపల్ రాజారావు తెలిపారు.

ఘనంగా సువర్చలా హనుమద్ కల్యాణం



గుర్వాయిగూడెం మద్ది ఆలయంలో సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి దర్శనార్థం వేకువజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఆలయం వద్ద కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ మండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై శ్రీస్వామి అమ్మవార్లను ఆసీనులను చేసి, అర్చక స్వాములు శ్రీ సువర్చలా హనుమద్ కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ కల్యాణ క్రతువులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయం వద్ద రాజానగరం, బాల రాజరాజేశ్వరి నాట్యమండలిచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. దర్శనాలకు విచ్చేసిన భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. సుమారు 4,000 మంది భక్తులు స్వామి నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాదం స్వీకరించినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు భారతదేశంలో మహిళా సురక్షత – యువత పాత్ర, విద్యార్థి దశ ప్రాముఖ్యత లేదా స్వచ్ఛమైన ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఆధ్యాత్మికత అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతకు ముందు ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు శాఖ ఆధ్వర్యంలో రాజయోగిని సిస్టర్ బీకే లావణ్య, బీకే హిమబిందు, బీకే బేబి ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు మెమొరీ మేనేజ్‌మెంట్ – బ్రెయిన్ ఎక్సర్‌సైజ్ అనే అంశంపై సందేశాన్ని, ఆధ్యాత్మికతతో కూడిన శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అధ్యక్షత వహించగా, బ్రహ్మకుమారిస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా వర్సిటీకి చంద్ర గ్రహణం

- బిల్లుల విడుదలలో కూటమి సర్కారు జాప్యం
- నత్తనడకన నిర్మాణ పనులు
- పశ్చిమగోదావరి జిల్లాకు తలమానికంగా ఆక్వా వర్సిటీ
- భవన నిర్మాణాలకు రూ.100 కోట్లు మంజూరు చేసిన జగన్ సర్కారు
- రూ.30 కోట్ల విలువైన పనులు పూర్తి



నత్తనడకన సాగుతున్న ఆక్వా వర్సిటీ నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ప్రతిష్టాత్మక ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ పనుల్ని కూటమి సర్కారు అటకెక్కించింది. ఇప్పటికే రూ.30 కోట్ల మేర పనులు జరగ్గా, బిల్లులు విడుదలవక నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితి. మరోవైపు ఈ ఏడాది అడ్మిషన్లు మొదలుకాగా ప్రస్తుతం క్యాంపస్ కాలేజీ నిర్వహిస్తున్న తాత్కాలిక భవనం సరిపోక తరగతులు ఎక్కడ నిర్వహించాలో తెలీక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా హబ్‌గా ప్రసిద్ధి చెందింది. భీమవరం, ఉండి, కైకలూరు తదితర నియోజకవర్గాల్లోని 2.53 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. జిల్లాలోని 15కు పైగా ప్రాసెసింగ్ ప్లాంట్ల ద్వారా రొయ్యలు విదేశాలకు ఎగుమతవుతున్నాయి. చేపలు, రొయ్యల మేతలు, చెరువుల నిర్వహణ సామగ్రి అమ్మకాలు, పట్టుబడి, ప్రాసెసింగ్ ప్లాంట్లు, రవాణా తదితర రూపాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో ఆక్వా రంగాన్ని మరింత ప్రోత్సహించే దిశగా గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేశారు. నరసాపురం కేంద్రంగా ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటుకు నిర్ణయించారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురం, జిల్లాలోని ఉండిలోని ఫిషరీస్ రీసెర్చ్ స్టేషన్లను యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువచ్చారు. యూనివర్సిటీ కోసం నరసాపురం పక్కనే లిఖితపూడిలో 40 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్యాంపస్ కాలేజీ, బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవన నిర్మాణాల కోసం రూ.100 కోట్లు మంజూరు చేశారు. తాత్కాలికంగా నరసాపురంలోని తుఫాన్ షెల్టర్ భవనంలో గతేడాది నవంబరు నుంచి 66 సీట్లతో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ తరగతులు ప్రారంభించారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో 1992లో క్యాంపస్ కళాశాల ప్రారంభించగా నరసాపురంలోని కళాశాల రాష్ట్రంలోనే రెండోది కావడం గమనార్హం. ఈ ఏడాది నూతన భవనాల్లో ఆక్వా వర్సిటీ, క్యాంపస్ కళాశాలను ప్రారంభించడం లక్ష్యంగా గత ప్రభుత్వంలో శరవేగంగా పనులు చేయించారు.

మందగించిన పనులు

అడ్మినిస్ట్రేటివ్, కళాశాల భవనాలకు సంబంధించి పనులు శ్లాబ్ దశకు చేరుకోగా బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలకు పునాదులు పూర్తయ్యాయి. ఇంతవరకు రూ.30 కోట్ల విలువైన పనులు జరగ్గా ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకుండా జాప్యం చేయడం నిర్మాణాలపై ప్రభావం చూపుతోంది. ఇప్పటికే పనులు మందగించగా మరో వారం పది రోజుల్లో బిల్లులు రాకుంటే పనులు నిలుపుదల చేసే ఆలోచనలో నిర్మాణ సంస్థ ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలోని మత్స్యశాఖ భవనాల్లోకి తరలిపోతుందన్న ప్రచారం ఉంది. భవనాల పనులు నిలిచిపోతే నరసాపురం ఆక్వా వర్సిటీపై నీలినీడలు కమ్ముకుంటాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సెకండ్ బ్యాచ్‌కు సరిపోని తాత్కాలిక భవనం

ప్రస్తుతం నరసాపురంలోని 12 గదులతో ఉన్న తుపాను షెల్టర్ భవనంలో తాత్కాలికంగా కళాశాల నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది రెండో బ్యాచ్‌కు కౌన్సెలింగ్ మొదలుకాగా ఇప్పటికే 35 సీట్లు పూర్తయ్యాయి. తరగతి గదులు, ల్యాబ్, ఆఫీస్, లైబ్రరీ, స్టాఫ్ రూమ్ ప్రస్తుతం ఉన్న భవనంలో ఒక బ్యాచ్‌కు మాత్రమే సరిపోతుంది. ఈ ఏడాది నుంచి రెండో బ్యాచ్ క్లాసులు మొదలు పెట్టాల్సిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ భవనం వెదుకులాటలో అధికారులు ఉన్నారు. ఉండి కేవీకేలో ఫిషరీస్‌కు సంబంధించిన భవనాలు ఉండటంతో కళాశాలను అక్కడ నిర్వహించాలని అధికారులు భావించారు. కాగా నరసాపురం నుంచి కళాశాల వెళ్లిపోతే స్థానికంగా వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో అధికార పార్టీ నేతలు ఆ ప్రయత్నాన్ని ఆపుచేయించినట్టు సమాచారం. స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ విద్యాసంస్థకు చెందిన బ్లాకులో కళాశాల నిర్వహించే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. బిల్లులు విడుదల చేసి త్వరితగతిన యూనివర్సిటీ భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పనులకు బ్రేక్



ఆక్వా వర్సిటీ విషయంలో ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పనులు ముందుకు సాగడం లేదు. ఈ ప్రాంతంలో ఆక్వా రంగం మరింత అభివృద్ధికి ఆక్వా వర్సిటీ దోహదపడుతుంది. యూనివర్సిటీకి సంబంధించిన భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా జిల్లాకు చెందిన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రత్యేక చొరవ చూపాలి.

–వద్ది రఘురాం, అప్సడా మాజీ వైస్ చైర్మన్

నవరత్నాల లోగో ధ్వంసం

టీడీపీ నాయకుల దుశ్చర్య



గోపవరంలో దుండగులు పగులగొట్టిన నవరత్నాల లోగో, శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న నేతలు

ముసునూరు: ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరు మండలంలో టీడీపీ వర్గీయుల దాడులను వైఎస్సార్ సీపీ మండల నేతలు తీవ్రంగా ఖండించారు. టీడీపీ నేతలు దాడి చేసి పగులగొట్టిన నవరత్నాల లోగో, ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు తదితరులు పరిశీలించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం మండలంలోని రమణక్కపేట, కాట్రేనిపాడు గ్రామాల్లో టీడీపీ వర్గీయులు, వైఎస్సార్ సీపీ అనుయాయులపై భౌతిక దాడులు చేసి ఇద్దరిని గాయపర్చారని, తాజాగా ఓ పచ్చ పత్రికలో వచ్చిన కథనాన్ని ఆసరాగా తీసుకుని గోపవరంలోని సచివాలయం–1పై ఏర్పాటు చేసిన నవరత్నాల లోగోను, ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాన్ని పగుల కొట్టారన్నారు. నేతలు ముసునూరుకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కంచర్ల వాణి, పార్టీ అధ్యక్షుడు వల్లభనేని గోపాల కృష్ణ, స్థానిక సొసైటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ పి.గంగాధర్, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ల వద్ద ధర్నా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఈ నెల 26న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు.ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులను వ్యవసాయానికి దూరం చేసేలా 3 వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. రైతుల ఆందోళన ఫలితంగా వ్యవసాయ నల్ల చట్టాలను అమలు చేయమని, రైతు డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలలో పాల్గొని అసువులు బాసిన 750 మంది రైతులకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని ఇచ్చిన హామీ తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేసి, రైతులు గుర్తించిన 52 పంటలకు మద్దతు ధర ప్రకటించి చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రైతులపై ముప్పేట దాడి జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ఇచ్చిన హామీ మేరకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, కార్మిక వర్గానికి తీరని ద్రోహం తలపెట్టే 4 లేబర్ కోడ్‌లు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే మాట్లాడారు. సమావేశంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

పాఠశాలల పనివేళలు మార్చొద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ఉన్నత పాఠశాలల పని వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పైలెట్ ప్రాజెక్టుగా నెల్లూరు జిల్లాలో అమలు పరచడాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ, ఏలూరు జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఈ. రత్నం బాబు, జీ మోహన్ రావు విద్యాశాఖను కోరారు. గతంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనివేళలు సవరించారన్నారు. 5 కిలోమీటర్ల పరిధి నుంచి విద్యార్థులు బడులకు వస్తున్నందున సాయంత్రం 5 వరకు పాఠశాలల నిర్వహణ వల్ల విద్యార్థులకు రక్షణ కరువవుతుందని, డ్రాపవుట్ల శాతం పెరుగుతుందని, ఈ మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు.

చంద్రబాబు సూపర్ బాదుడు

- కొండెక్కిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు
- విద్యావ్యవస్థ నిర్వీర్యం
- మాజీ మంత్రి కారుమూరి ఆగ్రహం



తణుకులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్ : చంద్రబాబు ప్రజలకు సూపర్ బాదుడు చూపిస్తున్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసరాలు, కూరగాయల ధరలు కొండెక్కించి పేదలను అప్పుల పాలు చేస్తున్న ఘనత చంద్రబాబు మూటగట్టుకున్నారని ఎద్దేవా చేశారు. 45 ఏళ్ల ఇండస్ట్రీ అని అధికారం ఇస్తే సంపద సృష్టిస్తానంటూ ప్రగల్భాలు పలికిన పెద్దమనిషి ఇప్పుడు దొరికినకాడికి అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తున్నారని దుయ్యబట్టారు. నాణ్యమైన విద్యుత్‌ను ధరలు పెంచకుండా అందిస్తానని హామీ ఇచ్చి రూ.18 వేల కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన రుద్దేందుకు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. నోరిప్పితే పచ్చి అబద్ధాలు మాట్లాడే చంద్రబాబు సూపర్ సిక్స్‌తో ప్రజలను మోసం చేశారని, బడ్జెట్‌లో వాటికి సరిపడా నిధులు కేటాయించకపోవడమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు.

విద్యారంగం అధోగతి

జగన్ హయాంలో విద్యావ్యవస్థకు అందిన ప్రోత్సాహంతో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, నేడు కూటమి ప్రభుత్వంలో పిల్లలు బడికి వెళ్లని స్థితి వచ్చిందని కారుమూరి ఎద్దేవా చేశారు. తల్లికి వందనం తల్లికి అందకపోవడంతో తమ బిడ్డలను పాఠశాలలకు పంపించని దుస్థితి రాష్ట్రంలో నెలకొందని విమర్శించారు. జగన్ సంక్షేమంతో మహిళలు ఆర్థికంగా ఎదిగారని దీంతో చిన్నపాటి వ్యాపారాలు చేయడం వంటి అంశాలతో మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరిగి ఏపీ మొదటి స్థానంలో ఉండేదని ఇప్పుడు 15వ స్థానానికి దిగజారిపోయిందని తెలిపారు.

పెరిగిన ధరలతో జీవనం కష్టం

కందిపప్పు, మినపప్పు, వంటనూనెల ధరలతో ప్రజలు బతకడమే కష్టంగా మారిందని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక 20 లక్షలు ఉద్యోగాలు యువతకు అందిస్తామని, రూ.3 వేలు నిరుద్యోగభృతి అందిస్తామన్న లోకేష్ కనిపించడంలేదని ఎద్దేవా చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ మాటేంటి..

ఫీజు రీయింబర్స్‌మెంట్ గాలికొదిలేశారని, ఫీజు కడితేనే పరీక్షలు రాయిస్తామని యాజమాన్యాలు చెబుతుండడంతో తల్లిదండ్రులు అప్పులుచేసి కట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల కిడ్నాప్‌లకు వలంటీర్లే కారణమన్నట్లుగా మాట్లాడి వారిని తీవ్రంగా అవమానించిన పవన్ కల్యాణ్ నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బాలికలు, మహిళల కిడ్నాప్‌లు, దాడులు, హత్యలపై నోరెత్తరే అని నిలదీశారు. ఉచిత ఇసుకని ప్రగల్భాలు పలికి నేడు ఇసుక దొరక్కుండా చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేశారని, మద్యం దుకాణాలు నేడు బార్లుగా మారాయని, ఇంటి వద్దకే మద్యం అన్నట్లుగా బెల్టు షాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని అన్నారు.

సోషల్ మీడియాపై ఉక్కుపాదం

ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడకూడదనే ఉద్దేశంతో సోషల్ మీడియా అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి అమాయకులను పోలీస్‌స్టేషన్లు, జైళ్లకు తిప్పుతున్నారని కాలం ఎప్పుడు ఒకేలా ఉండదని కారుమూరి హెచ్చరించారు. సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, విలేజ్ క్లినిక్‌ల ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంటే ఇప్పుడు మెడికల్ కళాశాలలను కూడా అవసరం లేదని వెనక్కి పంపిస్తున్న చంద్రబాబు ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కాదా అని నిలదీశారు.

శిల్పి గురించి శిల్పం మాట్లాడుతుంది

- దారుశిల్పి మందగుల కనకలింగ వీరబ్రహ్మం
- ఎవరి దగ్గరా శిష్యరికం చేయలేదు
- కళ తన జీన్స్‌లోనే ఉందన్నారాయన..
- కళ అన్నం పెట్టే రోజులు కావన్నాడు తండ్రి
- బ్రహ్మం నుదుట ఆ బ్రహ్మ 'కళాకారుడ'నే రాశాడు

ఏలూరు జిల్లా, చింతలపూడికి చెందిన కనకలింగ వీరబ్రహ్మం ఒకే చట్రంలో రామాయణాన్ని ఆవిష్కరించారు. అరవై నాలుగేళ్ల వీరబ్రహ్మం ఆవిష్కరణల్లో ఇలాంటివెన్నో. ఉలి పట్టుకోవడానికి ముందు ఆయన మృదంగనాదం చేశారు. ఎలక్ట్రికల్ వర్క్ చేశారు. చివరికి ఉలితోనే స్నేహాన్ని కొనసాగిస్తున్నారు. తన ఉలి ప్రస్థానం గురించి ఆయన 'సాక్షి'తో చెప్పిన వివరాలివి.

ఫొటోలో మృదంగమే ఉంది

వీరబ్రహ్మం తండ్రి స్వర్ణకారుడు, మృదంగ కళాకారుడు కూడా. వీరబ్రహ్మం మృదంగం మీద ఆసక్తి పెంచుకున్నారు. ఆరేళ్ల వయసులో కచేరీల్లో పాల్గొన్నారు కూడా. ఇవి అభిరుచిని సంతృప్తి పరుచుకోవడం కోసం మాత్రమేనని, పెరుగుతున్న బంగారం ధరలు చూస్తే స్వర్ణకారులకు పని దొరకడమూ కష్టమేనని, ఉపాధి కోసం మరేదైనా పని నేర్చుకోమని చెప్పారు. అది పెద్ద శరాఘాతం. మృదంగం ముట్టుకుంటే కొడతానని భయపెట్టినప్పుడు కన్నీళ్ల పర్యంతం అయి మృదంగంతో ఒక్క ఫొటో తీసుకుంటానని బతిమాలడం, చివరికి ఫొటో తీసుకుంటే ఆ ఫొటోలో మృదంగం కనిపిస్తోంది. కానీ బ్రహ్మం కనిపించలేదు. బ్రహ్మం సన్నగా, చిన్నగా ఉండడంతో ఆ ఫొటో కోరిక కూడా అసంతృప్తిగానే మిగిలిపోయింది. ఆయన జీవితంలో సంగీతం ఒక ముగిసిపోయిన ఘట్టమైంది.



శిల్పాలకు తుది మెరుగులు దిద్దుతూ..





చెక్కపై రామాయణ ఇతివృత్తం

కార్పొరేషన్ రద్దయింది

ఎలక్ట్రికల్ వర్క్ నేర్చుకుని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో మోటారు మెకానిక్‌గా జీవితాన్ని ప్రారంభించారు. నాలుగేళ్లకే ఆ కార్పొరేషన్ రద్దు కావడంతో మెకానిక్‌గా ప్రైవేట్ వర్క్స్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించారు. పోషణకు ఇబ్బంది లేదు కానీ, కళాత్మకమైన పని ఫలానా చేశాననే ఆత్మ సంతృప్తి లేకపోతే జీవితం పరిపూర్ణం కాదనుకునేవారు. ఖాళీ సమయాల్లో చెక్కను శిల్పంగా మలిచే ప్రయత్నం చేసేవారు. ఆ ప్రయత్నం అద్భుతంగా ఉండటంతో అతడి ప్రస్థానం కళాపథంలో నడిచింది.



పూలమొక్క, జీసస్ దారు శిల్పాలు

లేపాక్షి తక్కువ చేసింది

రాధాకృష్ణుల విగ్రహాన్ని చెక్కడానికి నెల పట్టింది. లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ వాళ్లు రెండున్నర వెయ్యికి తీసుకుంటామనడంతో హతాశులయ్యారు వీరబ్రహ్మం. కళాకారులు బతికేదెలా అన్నప్పుడు... తమ దగ్గర ఉన్న బొమ్మలన్నీ అదే ధరలో సేకరించినట్లు, లేపాక్షి బ్రాండ్ ఉంటే ఫినిషింగ్ చూడరని, ఫినిషింగ్ కోసం ఎక్కువ రోజులు కష్టపడకుండా స్థూలంగా రూపం వస్తే చాలని చెప్పారు నిర్వాహకులు. ఈ ధోరణి శిల్పాలకు శిల్పకారులకు శిక్ష విధించడమేనని బాధపడ్డారాయన. తన శిల్పాల కోసం మార్కెటింగ్ ప్రయత్నాలు మానేసి తనకు నచ్చినవి చెక్కుతూ సంతోషిస్తున్నారు. కానీ ఆయన శిల్పాలు మాట్లాడుతున్నాయి, ఆయన పనిని మార్కెట్ చేస్తున్నాయి. బ్రహ్మంలో శిల్పకారుడిని నిత్యం పనిలో ఉంచుతున్నాయి. నోటిమాట ద్వారా తెలుసుకున్న కళాభిమానులు బొమ్మల కోసం ఆర్డర్‌లు ఇస్తున్నారు. వీటితోపాటు తన సంతృప్తి కోసం మూడు నెలలు శ్రమించి రామాయణం మొత్తాన్ని ఒకే చట్రంలో చెక్కారు. జాతీయ చిహ్నం, భరతమాత, రవీంద్రనాథ్ ఠాగూర్ నుంచి పింగళి వెంకయ్య వరకు మన జాతీయనాయకుల శిల్పాల కోసం ఉలి పట్టడం ఆయన ఆకాంక్ష. శిల్పగురు గౌరవాన్ని అందుకోవడం శిల్పకారుడిగా తన లక్ష్యమని చెప్పారాయన.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

వినాయకుడితో కొత్త జీవితం



నేను చెక్కిన తొలి శిల్పం వినాయకుడు. సరదా కొద్దీ చిన్న చిన్న బొమ్మలేవో చేస్తుండేవాడిని. అది 2001, మా మిత్రుడు కొన్న వినాయకుడి విగ్రహాన్ని చూస్తే బాధనిపించింది. ఆ శిల్పి మనసు పెడితే బాగా చెక్కి ఉండవచ్చనిపించింది. కళ అంతరించిపోవడానికి దగ్గరగా ఉందా అనే ఆవేదన కూడా కలిగింది. అలాంటి వినాయకుడి రూపాన్నే ఇంకా అందంగా తీసుకురావాలని చెక్కాను. అప్పటి నుంచి దారుశిల్పిగా మారాను. మా అమ్మ మట్టిబొమ్మలు చేసేది. తాతయ్య వెండి, రాగి వస్తువులకు నగిషీ పనిచేసేవారు, అన్నయ్య డ్రాయింగ్ వేసేవారు. ఇన్ని కళల మధ్య పెరగడం వల్లనేమో నాతోపాటు నాలో శిల్పకారుడు కూడా పెరిగాడు.

– మందగుల కనకలింగ వీరబ్రహ్మం, దారుశిల్పి

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

ఏలూరు రూరల్ : డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకూ మార్టేరులో జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఏలూరు జిల్లా జట్టు ఎంపికైనట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాస్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు కస్తూరిభా బాలికల పాఠశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో క్రీడాకారిణులు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. బి లీలా, బి భవానిదేవి, ఏ టాలీఅనిత, జి నాగదేవి, ఆర్ మహతి, టి జ్యోతి, పి వియశ్రీ, పి లక్ష్మీప్రవల్లిక, పి జయశ్రీ, వి నిఖిల్‌రెడ్డి, ఏ రుత్విక, జి పూజితతో పాటు స్టాండ్‌బైగా జి సాయిసుధ, ఏ పూర్ణచంద్రిక, వి యామిని, సీహెచ్ ఝాన్సీ ఏలూరు జిల్లా జట్టులో చోటు సాధించినట్లు అసోసియేషన్ కోశాధికారి కె మురళీకృష్ణ ప్రకటించారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

ఏలూరు టౌన్: అప్పుల బాధలు తాళలేక ఆటో మొబైల్ షాప్ నిర్వాహకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామానికి చెందిన గొల్ల సద్గుణరావు (34) స్థానికంగా ఆటోమొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా దుకాణం నిర్వహణ సరిగా లేక అప్పులపాలయ్యాడు. దీంతో అక్కడి నుంచి ఆదివారం ఏలూరు వచ్చాడు. ఏలూరులోని నిమ్మకాయల యార్డు సమీపంలో గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. రైల్వే ఎస్సై సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కానిస్టేబుల్‌పై పోక్సో కేసు

నరసాపురం: పోడూరు పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సింగ్ అనే వ్యక్తిపై ఆదివారం నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపిన వివరాలివి. నరసాపురం పట్టణంలోని మానేపల్లివారి వీధికి చెందిన సింగ్ అదే ప్రాంతంలోని ఓ 14 ఏళ్ల బాలిక ఇంటికి వెళ్లి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక ఆమె చిన్నమ్మ ఇంటికి పారిపోయి విషయం చెప్పింది. ఆమె వచ్చి సింగ్‌ను ప్రశ్నించగా ఆమెపై కూడా దౌర్జన్యానికి పాల్పడి చంపేస్తానని బెదిరించినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సింగ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై జయలక్ష్మి తెలిపారు.

ఉమాసోమేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీఉమాసోమేశ్వర స్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం శ్రీఉమా సోమేశ్వర జనార్దనస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి కార్తీక మాసం మూడవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిపారు. స్వామివారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రబీ మొక్కజొన్న సాగుకు ఇదే అదును



మెట్ట ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న రబీ మొక్కజొన్న పంట

పాడి-పంట

చింతలపూడి: మొక్కజొన్న పంటను ఆహార పంటగానే కాకుండా దాణా రూపంలోను, పశువులకు మేతగాను, వివిధ పరిశ్రమల్లో ముడి సరుకుగాను ఉపయోగిస్తున్నారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటను విత్తుకోవడానికి ఇదే సరైన సమయమని వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు బి నాగ కుమార్ రైతులకు సూచిస్తున్నారు.

ఎలాంటి నేలలు అనువు

మొక్కజొన్న సాగుకు మురుగు పోయే లోతైన ఎర్ర గరప, మధ్యస్థ నేలలు బాగా అనుకూలం. రబీ సీజన్‌లో అక్టోబర్ 15 నుంచి నవంబర్ 30లోగా విత్తితే ఎక్కువ దిగుబడులు పొందడానికి అవకాశం ఉంది. వరి మాగాణి తరువాత జీరో టిల్లేజ్ పద్ధతిలో డిసెంబర్ చివరి వరకు రైతులు విత్తుకోవచ్చు. హైబ్రీడ్ విత్తనాలైతే ఎకరానికి 8 కేజీల విత్తనాలు సరిపోతాయి. విత్తటానికి ముందు నేలను 3, 4 సార్లు నాగలితో దుక్కి దున్నాలి. ఎకరానికి 10 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువును ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. తరువాత బోదె నాగలితో బోదెలు, కాలువలు చేసుకోవాలి. 8 కేజీల విత్తనానికి 24 గ్రాముల మాంకోజెబ్ పొడి మందుతో విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే లేత దశలో తెగుళ్ల బారి నుంచి కాపాడుకోవచ్చు. విత్తనాలను చాళ్ళ మధ్య 60 సెం.మీటర్ల దూరంలో, మొక్కల మధ్య 20 సెం.మీటర్ల దూరం ఉండేటట్లు విత్తుకోవాలి. మొలకెత్తిన 10 రోజుల తరువాత ఒక మొక్కను ఉంచి మిగిలిన మొక్కలను తీసివేయాలి.

ఎరువుల వాడకం

భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి ఎరువులను వాడుకుంటే నాణ్యమైన దిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుంది. ఎకరానికి 20 కేజీల జింక్ సల్ఫేట్, 96 కేజీల నత్రజని, 32 కేజీల భాస్వరం, 32 కేజీల పొటాష్ ఇచ్చే ఎరువులను వాడుకోవాలి. మొక్కల్లో జింక్ లోపం కనిపించినప్పుడు లీటర్ నీటికి 2 గ్రా. చొప్పున జింక్ సల్ఫేట్ కలిపి పైరుపై పిచికారీ చేయాలి.



బి నాగకుమార్, వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు

కలుపు నివారణ ఇలా..

పంట విత్తిన 2, 3 రోజుల్లోపు అట్రాజిన్ అనే కలుపు మందును ఎకరాకు 800 గ్రా 200 లీటర్ల నీటిలో కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయడం వలన కలుపు మొక్కలను నెల రోజుల వరకు అదుపు చేయవచ్చు. విత్తిన 30 రోజుల్లోపల వెడల్పాటి కలుపు మొక్కలను గమనిస్తే 2, 4-డీ సోడియం సాల్ట్ ఎకరానికి 500 గ్రాముల పొడి మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కాండం తొలుచు పురుగు

మొక్కజొన్న పంట మొలకెత్తిన 10, 20 రోజులకు కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. పిల్ల పురుగులు మొదట ఆకులపై పత్రహరితాన్ని గోకి తింటాయి. తరువాత ముడుచుకుని ఉన్న ఆకుల ద్వారా కాండం లోపలకు చేరతాయి. ఈ ఆకులు విచ్చుకున్న తరువాత గుండుసూది మాదిరి రంధ్రాలు లేదా పొడవాటి చిల్లులు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వల్ల మొవ్వ చనిపోతుంది. దీనిని డెడ్ హార్ట్ అంటారు. కాండం లోపల గుండ్రని లేదా ఎస్ ఆకారంలో సొరంగాలు ఏర్పరుస్తుంది. ఇవి పూతను, కంకిని ఆశించడం వలన దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ

మొక్కజొన్న నాటిన 20-30 రోజులకు కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలను ఎకరాకు 3 కిలోల చొప్పున ఆకుల సుడుల్లో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగును సమర్థవంతంగా నిలువరించవచ్చు.

చెక్కపల్లిలో భారీ చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న నూజివీడు డీఎస్పీ, సీఐ, ఎస్సై

ముసునూరు: చెక్కపల్లిలోని ఓ ఇంటిలో భారీ చోరీ జరిగింది. రూ.4 లక్షల నగదు, భారీ బంగారాన్ని దొంగలు అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. చెక్కపల్లిలో మందలపు వెంకట రాధాకృష్ణ దంపతులు మూడు రోజుల క్రితం దైవ దర్శనార్థం తిరుమల తిరుపతి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఇంటి వెనుక వైపు తలుపులు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం గమనించిన ఆ ఇంటి పనివారు యజమానికి విషయం తెలియజేశారు. అప్పటికే తిరుగు ప్రయాణంలో ఏలూరుకు చేరుకున్న రాధాకృష్ణ ముసునూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనలో రూ.4 లక్షల నగదు, భారీగా బంగారం అపహరణకు గురైనట్లు చెబుతున్నారు. నూజివీడు సీఐ కొప్పిశెట్టి రామకృష్ణ, ఎస్సై ఎం.చిరంజీవి, చాట్రాయి ఎస్సై రామకృష్ణ జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి, ఆధారాలు సేకరించారు. డీఎస్పీ కేవీవీఎస్‌వీ ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు.

క్రీడలతో ఆత్మస్థైర్యం మెండు



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన జంగారెడ్డిగూడెం టీం



కబడ్డీలో విజేతగా నిలిచిన వట్లూరు జట్టు

- గురుకుల కళాశాల అడిషనల్ కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్
- ముగిసిన జోనల్ పోటీలు

భీమడోలు: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందించడంతోపాటు ఆత్మస్థైర్యాన్ని పెంపొందింపజేస్తాయని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల అడిషనల్ కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్ అన్నారు. భీమడోలు మండలంలోని పోలసానిపల్లి బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో జోన్ 2 బాలికల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. జోన్ పరిధిలోని ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన 29 కళాశాలల నుంచి 1,050 మంది బాలికలు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటారు. ప్రిన్సిపాల్ వీవీ రమణ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. పోటీల విజేతల వివరాలను డీసీవో ఎన్.భారతి, ప్రిన్సిపాల్ వీవీ రమణ, జోనల్ కోఆర్డినేటర్ శ్యామల, పీడీ సాయిలక్ష్మి ప్రకటించారు.

స్కూల్ గేమ్స్ విభాగంలో..

కబడ్డీలో వట్లూరు (పశ్చిమగోదావరి), బల్లిపర్రు (కృష్ణా), వాలీబాల్‌లో వెంకటాపురం(తూర్పుగోదావరి), పోలసానిపల్లి(పశ్చిమ), ఖోఖోలో ద్వారకాతిరుమల, పోలసానిపల్లి జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. త్రోబాల్ పోటీల్లో పోలసానిపల్లి (పశ్చిమ) ముప్పాళ్ల (కృష్ణా), చెస్‌లో ముమ్మిడివరం(తూర్పు), ద్వారకాతిరుమల (పశ్చిమ), క్యారమ్స్‌లో తుని, పిఠాపురం జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌ను వి.ఇందు(జంగారెడ్డిగూడెం), వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను పి.పూజ, స్పోర్ట్స్ ఆల్‌రౌండర్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లను జంగారెడ్డిగూడెం కైవసం చేసుకున్నాయి.

కళాశాల గేమ్స్ విభాగంలో..

కబడ్డీలో గోపాలపురం(తూర్పు), కుంటముక్కల (ఎన్టీఆర్), వాలీబాల్‌లో పి.వెంకటపురం (తూర్పు), గోపాలపురం (తూర్పు), ఖోఖోలో ఏలేశ్వరం(తూర్పు), పోలసానిపల్లి (పశ్చిమ). త్రోబాల్ విభాగంలో పోలసానిపల్లి, జంగారెడ్డిగూడెం ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. చెస్ విభాగంలో వీరపనేనిగూడెం (కృష్ణా), పి.వెంకటపురం (తూర్పు), క్యారమ్స్‌లో వీరపనేనిగూడెం (కృష్ణా), ముమ్మిడివరం(తూర్పు) మొదటి రెండు స్థానాలు సాధించాయి. స్పోర్ట్స్ విభాగంలో చాంపియన్ వి.నిఖిత (ముప్పాళ్ల), వ్యక్తిగత చాంపియన్‌షిప్ కె.లావణ్య (తుని), ఆల్‌రౌండ్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ గోపాలపురం, ఆల్‌రౌండ్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విభాగంలో గోపాలపురం, చాంపియన్‌షిప్‌ను పోలసానిపల్లి కైవసం చేసుకుంది.

పాఠశాల, కళాశాల స్థాయిలో విజేతలు వీరే

100 మీటర్ల పరుగులో జి.విమలశ్రీ, టి.పూజ, టి.నీలిమప్రియ, 200 మీ. పరుగులో సీహెచ్ కుమారి, డి.ప్రీతిక, కె.మనీషా, 400 మీ. పరుగులో పి.పూజ, కె.హేమకుమారి, బి.రమ్య, 800 మీ. పరుగులో వి.ఇందు, సీహెచ్ కుమారి, కె.హేమకుమారి, డిస్కస్ త్రోలో కె.కృష్ణశ్రీ, కె.శ్రీవల్లి, ఎస్.రాణి, జావెలెన్ త్రోలో ఎస్.రాణి, కె.శ్రీవల్లి, సీహెచ్ సమీరా, లాంగ్ జంప్‌లో బి.రమ్యశ్రీ, వై.రమ్యశ్రీ, సీహెచ్ దివ్యశ్రీ, హైజంప్‌లో బి.రమ్యశ్రీ, సీహెచ్ శిరీషా, దివ్యశ్రీ, షాట్‌పుట్‌లో పి.కీర్తన, పి.కృష్ణవేణి, డి.శ్రీలత, వ్యక్తిగత చాంపియన్స్‌లో వి.ఇందు, పి.పూజ, బి.రమ్యశ్రీ విజేతలుగా నిలిచారు.

ఎక్సైజ్ దాడులు

తణుకు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలుచోట్ల ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. తణుకు మండలం కోనాల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గెడ్డం వెంకటేష్‌ను అరెస్ట్ చేసి, 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్తి మణికంఠరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

పాలకొల్లు అర్బన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పోడూరు మండలం వేడంగి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి పెద్దిరాజును అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 4 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు.

కై కలూరు: ముదినేపల్లి మండలం ప్రొద్దువాక గ్రామంలో బెల్టు దుకాణాలపై ఆదివారం ఎక్సైజ్ దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్‌కే.రమేష్ చెప్పారు. బెల్టు దుకాణం నిర్వహిస్తున్న కల్లి రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో ప్రొహిబిషన్ ఎస్సై ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు: భీమడోలు గొలుసుల గేటు ఏరియాలో బెల్ట్‌షాపు నడుపుతున్న వనం వెంకటరత్నం అనే వ్యక్తిని ఆదివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. అతని వద్ద నుంచి 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



బీచ్‌లో సముద్ర స్నానంతో ఉల్లాసంగా గడుపుతున్న సందర్శకులు

కార్తీకమాసం మూడో ఆదివారం కావడంతో కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లకు సందర్శకులు భారీగా తరలివచ్చారు. సముద్రపు అలల మధ్య కేరింతలు కొడుతూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. అనంతరం తీరంలోని ఆలయాలను సందర్శించుకున్నారు. దాదాపు 8 వేల మంది పర్యాటకులు బీచ్‌ను సందర్శించారని అధికారుల అంచనా. సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నలుగురు ఎస్సైలు, సుమారు 75 మంది సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

– మొగల్తూరు



విన్యాసాలు చేస్తూ యువకుల సందడి

తూర్పు కాపులకు ఓబీసీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



మంత్రి శ్రీనివాసరావు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ యశస్వినిలను సత్కరిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తూర్పు కాపులను బీసీ డీ జాబితాలో చేర్చి విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించే విధంగా కృషి చేస్తామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం తణుకులో తూర్పు కాపు విద్య, విజ్ఞాన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాష్ట్ర తూర్పు కాపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బలగం సేతుబంధన సీతారామ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తూర్పు కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి బొత్సా సత్యనారాయణ తూర్పు కాపులకు మైగ్రేషన్ సర్టిఫికెట్‌తో సంబంధం లేకుండా బీసీ డీ కోటాలో రిజర్వేషన్ అమలు చేశారని చెప్పారు. ప్రస్తుతం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లాలకే తూర్పు కాపులకు ఓబీసీ సర్టిఫికెట్లు ఇస్తున్నారని, ఈ పద్ధతిలోనే రాష్ట్రంలో అన్ని ప్రాంతాల తూర్పు కాపులకు సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ తల్లి దర్శనార్థం వచ్చిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు తెలంగాణ, కృష్ణా జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

భీమవరం అర్బన్: మహిళను వేధిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం లోసరి గ్రామానికి చెందిన శీలం ధనలక్ష్మిని వీరవాసరం మండలం తోకలపూడి గ్రామానికి చెందిన వీరవల్లి వెంకట సత్యనారాయణ వెంటాడి వేధిస్తున్నాడు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన టెన్నిస్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఆదివారం చెరుకూరి బుద్ధావతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్స్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కాస్మో క్లబ్ ద్వారా ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకుంటున్నారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, క్లబ్ సెక్రటరీ వీవీ సోమరాజు, ట్రెజరర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

భీమవరం అర్బన్: అదనపు కట్నం వేధింపులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. తాడేరు గ్రామానికి చెందిన కోయ దుర్గాదేవికి సురేష్‌కు 2021లో వివాహమైంది. వివాహ సమయంలో దుర్గాదేవి తల్లిదండ్రులు పసుపు కుంకుమల కింద కొంత సొమ్మును ముట్టజెప్పారు. అయితే గత కొంతకాలంగా అదనపు కట్నం తీసుకురమ్మని భర్త సురేష్, అత్తమామలు, ఆడపడుచు తోడల్లుడు వేధిస్తున్నారని దుర్గాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘కమర్షియల్’గా వాడేస్తున్నారు

- తెలుపు నంబర్ ప్లేట్ కలిగిన వాహనాలు కిరాయికి తిప్పుతూ దోపిడీ
- నిబంధనలు అతిక్రమిస్తున్నా పట్టించుకోని రవాణా శాఖ



భీమవరం (ప్రకాశం చౌక్): రవాణాకు ఉపయోగించే వాహనాలకు పసుపు రంగు నంబర్ ప్లేట్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. అయితే కొందరు తెలుపు రంగు నంబర్ ప్లేట్ కలిగిన వాహనాలను రవాణాకు వినియోగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా నిబంధనలు ఉల్లంఘిస్తూ కిరాయిలకు తిప్పుతున్నా రవాణా శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఎక్కువగా తెలుపు రంగు నంబర్ ప్లేట్ కలిగిన కార్లను కిరాయిలకు తిప్పుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.


జోరుగా దందా

తెలుపు రంగు నంబర్ ప్లేట్ కలిగిన కార్లు సొంత కార్లు అని అర్థం. వాటిని కిరాయికి వినియోగించడం నేరం. కానీ కొందరు తెలుపు రంగు నంబరు ప్లేట్‌తో ఉన్న కార్లను వారి ఇష్టానుసారం కిరాయిలకు తిప్పుతున్నారు. కిలోమీటర్ల దూరానికి వారే ధర నిర్ణయించుకుని ప్రజలను దోచుకుంటున్నారు. జిల్లాలో ఈ వ్యాపారం పెద్దఎత్తున సాగుతోంది. కొందరు ట్రాన్స్‌పోర్టు పేరు పెట్టి మరీ తెలుపు రంగు నంబరు ప్లేట్ కలిగిన కార్లతో ఈ తరహా వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో భీమవరంతోపాటు తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా ట్రాన్స్‌పోర్టు పేరుతో 5 నుంచి 10 కార్లు నడేపేవారు నెలకు ఒక రేటు, రోజుకు అయితే మరో రేటు పెట్టి కిరాయిలు వసూళ్లు చేస్తున్నారు. ఇలాంటి కార్లు జిల్లాలో సుమారు 5 వేలకు పైనే ఉన్నాయి. నిబంధనల మేరకు ట్రాన్స్‌పోర్టు చేసే కార్లు జిల్లాలో సుమారు 1,000 నుంచి 1,500 లోపే ఉన్నాయంటే దీనిని బట్టి ఈ వ్యాపారం ఏ మేరకు జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

బీమా కోల్పోతారు

వాహన చట్ట ప్రకారం కిరాయికి ప్రయాణికుల్ని తరలించడానికి (ట్యాక్సీ) కారుకు పసుపు రంగు నంబరు ప్లేట్‌ను కేటాయిస్తారు. ఈ రంగు నంబర్ ప్లేట్ రిజిస్ట్రేషన్‌కు అధిక ఖర్చు అవుతుంది. ఇలాంటి కారుకు బీమా ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా పర్మిట్, ఫిట్‌నెస్ పరీక్షలు రెండేళ్లకు ఒకసారి చేయించాల్సి ఉంటుంది. అనుకోని పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే కారులో ప్రయాణించే అందరికీ బీమా వర్తిస్తుంది. అదే తెలుపు రంగు నంబర్ ప్లేట్ కలిగిన కారులో ప్రయాణించే వారికి బీమా తక్కువ ఉంటుంది. అలాగే 15 ఏళ్లకు లైఫ్, ఇతర రవాణా శాఖ ఖర్చులు తక్కువగా ఉంటాయి. పసుపు రంగు ప్లేట్ కలిగిన కారుకు రవాణా శాఖ అనుమతులు పొందాలంటే ఖర్చు 10 నుంచి 20 శాతం ఎక్కువగా ఉంటుంది. దీంతో కొందరు ఖర్చు తగ్గించుకునేందుకు తెలుపు రంగు నంబర్ ప్లేట్ కారు (సొంత కారు) తీసుకుని నిబంధనలు అతిక్రమించి రవాణా వ్యాపారం సాగిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



తెలుపు రంగు నంబర్ ప్లేట్ కలిగిన కార్లను రవాణాకు ఉపయోగించడం నేరం. కేవలం పసుపు రంగు నంబర్ ప్లేట్ రిజిస్ట్రేషన్ చేసిన కార్లను మాత్రమే రవాణాకు, కిరాయికి ఉపయోగించాలి. ఈ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. నిబంధనలు ఉల్లంఘించి ట్రాన్స్‌పోర్టు చేస్తున్న కార్లను తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటున్నాం.

– టి.ఉమామహేశ్వరరావు
జిల్లా రవాణా శాఖ అధికారి భీమవరం

క్లుప్తంగా

హెల్మెట్ వినియోగంపై అవగాహన

తణుకు: రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం హెల్మెట్ లేకపోవడంతోనే మృత్యువాత పడుతున్నారని తణుకు ట్రాఫిక్ ఎస్ఐ డి.ఆదినారాయణ పేర్కొన్నారు. ఆదివారం తణుకు పట్టణంలోని స్థానిక నరేంద్ర సెంటర్‌లో ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల 75 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డుపై ప్రయాణించే సమయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. వాహనంతో పాటు వాహనపత్రాలు ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయిబాబా వార్షిక మహోత్సవాలు

అత్తిలి: మండలంలోని సంతమార్కెట్ సెంటర్‌లో షిర్డీసాయిబాబావారి వార్షిక మహోత్సవాలు ఆదివారం నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీషిర్డీసాయిబాబాను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై బాబాను దర్శించుకున్నారు. ఈనెల 19న శ్రీషిర్డీసాయిబాబా వారి ఊరేగింపు, 25న అఖండ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అత్తిలి నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సీతాంభరం, ఉపాధ్యక్షుడు కొడవర్తి సురేష్, కార్యదర్శి అయినపర్తి వెంకటేష్, కోశాధికారి పోలవరపు కుమార్, సలహాదారు లంక బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో నిడదవోలు రాజేశ్వరీ రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. దాతలు పదంకుమార్ గుప్తా ఆర్థిక సహకారం చేశారు. ఈ శిబిరంలో 97 మంది పాల్గొన్నారు. 29 మందికి కళ్లజోడ్లు అందించేందుకు నిర్ణయించారు. 11 మందికి ఆపరేషన్ నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి తరలించారు. ఏఆర్‌కే పరమేశ్వర్లు, చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, మదన్ మోహన్ అగర్వాల్, సన్నిధి సూర్యనారాయణ మూర్తి, వంగపండు రామోహన్‌రావు, బాపయ్య శర్మ, యర్ర ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

దళిత హక్కులను పరిరక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పొట్ల సురేష్

ఇరగవరం: అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను పరిరక్షించుకోవాలని, దళితులు ఐకమత్యంతో పోరాడాలని తణుకు నియోజకవర్గ దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు పొట్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఇరగవరం మండలంలో దళిత ఐక్యవేదిక సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి దళితులంతా ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంగా శ్రీనివాస్, జాలే సుబ్బారావు, భావన రాము, బొంత చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్తీక మాసం పురస్కరించుకుని పట్టణంలోని ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం డిపో నుంచి పంచారామ క్షేత్ర దర్శనానికి రెండు సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సులు, మూడు పల్లె వెలుగులు బస్సులలో ప్రయాణికులు తరలివెళ్లారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌లను సంప్రదించాలని కోరారు.

కులం పేరుతో దూషించిన నేరంపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: కులం పేరుతో దూషించిన నేరంపై ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేఎస్‌వీ.ప్రసాద్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన లక్కోజు శ్రీనివాసరావు భార్య చనిపోవడంతో అతని పిల్లలకు ఆస్తి ఇస్తానని అంగీకరించాడు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, ఆమె భర్త రాజు, గ్రామ పెద్దలు అడిగేందుకు వెళ్లగా శ్రీనివాసరావు వారిని కులం పేరుతో దూషించాడు. ఈ మేరకు గ్రామ పెద్ద ఉండ్రాజవరపు రాజు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ ప్రసాద్ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భయపెడుతున్న వారధులు

- ప్రమాదకరంగా మారిన పై వంతెనలు
- పట్టించుకోని అధికారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణాన్ని ఏలూరు కాలువ రెండుగా విభజించింది. ఒక వైపు వన్ టౌన్, రెండోవైపు టూ టౌన్‌గా పిలవబడుతున్నాయి. టూ టౌన్ నుంచి ఏలూరు కాలువను దాటి వన్ టౌన్‌కు వెళ్లేందుకు పెద్ద వంతెన (బౌ వంతెన) నిర్మించడం జరిగింది. మొదటి ఫ్లైఓవర్ బ్రిడ్జి లేనప్పుడు అప్పట్లో వన్ టౌన్ నుంచి టూ టౌన్‌కు వెళ్లాలన్న టూ టౌన్ నుంచి వన్ టౌన్‌కు రావాలన్న పెద్ద వంతెన (బౌ వంతెన) ప్రధానంగా ఉండేది. అదే మార్గంలో వాహనాలు అన్ని అప్పట్లో రైల్వే లైన్ మీదుగా రాకపోకలు సాగాయి. అనంతర కాలంలో మొదటి ఫ్లైఓవర్ నిర్మించడంతో బౌ వంతెన వినియోగం తగ్గిపోయింది. లారీలు, ఇతర చిన్న చిన్న వాహనాలు బౌ వంతెన మీదుగా వార్ఫ్‌రోడ్డుకు వెళ్లేందుకు, రైల్వే గూడ్స్ షెడ్డుకు వెళ్లేందుకు మాత్రమే ఉపయోగపడేది. బౌ వంతెన క్రమేపీ శిథిలావస్థకు చేరింది. బ్రిడ్జి మార్గం అస్తవ్యస్తంగా మారింది. ఈ బ్రిడ్జి ఎప్పుడైన కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ బ్రిడ్జి మార్గంలో వాహనాలు వెళ్లకుండా ఇనుప రాడ్‌ను ఉపయోగించి అడ్డంకి ఏర్పాటు చేశారు. బౌ వంతెనకు ఏర్పాటు చేసిన ఆర్చిలను కలుపుతూ కట్టిన పిట్టగోడలు కాలువలోకి పడిపోతున్నాయి. ఆర్చిలకు ఉన్న పిట్టగోడ దిగువలో ఏర్పాటు చేసిన మెట్టు పైకి ఎక్కితే కాలువలో పడిపోయే ప్రమాదం కూడా ఉంది. కొందరు మందు బాబులు ఆ మెట్టు మీద ఎక్కడం, ఫీట్లు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పెద్ద వంతెనకు రావి చెట్లు పెరగడంతో వంతెన బీటలు వారే ప్రమాదం ఉందని అంటున్నారు.



శిథిలావస్థకు చేరిన పెద్ద బౌ వంతెన ఇరువైపుల దృశ్యాలు

మరమ్మతులు చేపట్టాలి



పోలీస్ ఐలాండ్ వద్ద పెద్ద బౌ వంతెన, స్థానిక ఏలూరు రోడ్డులోని శంకరమఠం వద్ద చిన్నవంతెన శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రమాదాలు జరగకముందే మరమ్మతులు చేపట్టాలి. పెద్ద బౌ వంతెనపై రోడ్డు నిర్మాణం చేపట్టాలి. వంతెన పిట్టగోడలు వద్ద మందుబాబులు ఫీట్లు చేయకుండా చూడాల్సిన అవసరం ఎంతైన ఉంది. లేని పక్షంలో వారు నేరుగా కాలువలోకి పడే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు తక్షణమే స్పందించాలి

– దామరాజు వర ప్రసాద్, తాడేపల్లిగూడెం



పెద్ద బౌ వంతెన ఆర్చి వద్ద తొలగిన పిట్టగోడ, ఆర్చి వద్ద మందుబాబు

ఈ బ్రిడ్జిని తొలగించడమో, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేయడంతో పాటు రావి చెట్లు పెరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా చిన్నవంతెన

పట్టణంలో రైల్వే స్టేషన్‌కు ఎదురుగా టూ టౌన్‌లోని ఏలూరు రోడ్డు మార్గంలో స్థానిక శంకరమఠం వద్ద ఏలూరు కాలువకు చిన్న వంతెన ఎప్పటి నుంచో ఉంది. నేడు వంతెనకు ఉన్న ఇరువైపుల గోడలు బీటలు వారాయి. పిచ్చి మొక్కలు మొలవడంతో వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వన్ టౌన్ నుంచి రెండో టౌన్‌కు వెళ్లేందుకు కాలువ వరకు రైల్వే బ్రిడ్జి ఉంది. కాలువపై చిన్న వంతెన కారణంగా పాదచారులకు, సైక్లిస్టులకు ఎంతో ఉపయుక్తంగా మారింది. ఈ వంతెన సైతం టూ టౌన్ నుంచి వన్ టౌన్ వచ్చే పాదచారులకు ఎంతో ఉపయుక్తం. ఈ వంతెనను సైతం రిపేర్లు చేస్తే ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. అంతేగాక చిన్నవంతెన నుంచి రైల్వే వంతెన వరకు వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలిగిస్తే రైలు ప్రయాణీకులకు, బస్సు ప్రయాణీకులకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందని, ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన శంకరమఠం వద్ద చిన్నవంతెన దృశ్యం

ఘనంగా కార్తీక వన సమారాధనలు



కార్తీక వన సమారాధనలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం



కాపు సంఘీయులు కార్తీక వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: మండలంలోని మండపాక గ్రామంలో వెలమ సంఘీయుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును వెలమ సంఘీయులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో మండపాక ఎంపీటీసీ సభ్యులు కాళ్ల సన్యాసిరావు, వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వెలన సంఘ నాయకులు పెంటా నాగు తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో కాపు సంఘీయుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దళిత సేన బలోపేతానికి కృషి చేస్తున్నాం

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లాలో దళిత సేన బలోపేతానికి కృషి చేస్తున్నామని ఆ సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని పెదతాడేపల్లి దళిత సేన జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చీలి మోహనరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన ఉండవల్లి శ్రీదేవికి అభినందనలు తెలిపారు. మాదిగల ఆర్థికాభివృద్ధికి, సబ్సిడీ రుణాలు మంజూరుకు కృషి చేయాలని సూచించారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు దిర్సిపాముల పుష్ప, పెదతాడేపల్లి గ్రామ అధ్యక్షుడు దూలపల్లి రాంబాబు, మహిళా అధ్యక్షురాలు రాణి, కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పెదతాడేపల్లి గ్రామంలో జరిగిన దళిత సేన జిల్లా కార్యకర్తల సమావేశం దృశ్యం

ఏకసభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల గౌరవాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై ఏకసభ్య కమిషన్ నియమించే అధికారం ఏపీ రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం ఏర్పాటు చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ ఉన్నందున, దానిని వ్యతిరేకిస్తూ వేరు కమిషన్ నియమించడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. విశ్రాంతి అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రాను నియమించాడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. విశ్రాంతి అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రా కమిషన్‌ను మాలలు అడుగడుగునా వ్యతిరేకిస్తూ అడ్డుకోవాలని మంగరాజు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలోబేతాళ శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

వాకర్స్‌కు అవార్డుల పంట

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ పలు అవార్డులు అందుకున్నారు. ఏలూరు వైఎంహెచ్ఏ హాల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా కాన్ఫరెన్స్ జరిగింది. ఆ కాన్ఫరెన్స్‌లో స్థానిక వాకర్స్ అధ్యక్షుడు దూలం నాగరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ అవార్డు, బెస్ట్ వాకర్ ఇన్వాల్‌మెంట్ అవార్డు, బెస్ట్ అడ్మినిస్ట్రేషన్ అవార్డులు అందుకున్నారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి.మురళీమోహన్‌రావు, జిల్లా గవర్నర్ వై.సత్యనారాయణ, ఆర్‌సీ నరసింహమూర్తి, వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీ కృష్ణారావు, డిప్యూటీ గవర్నర్ ప్రవా శ్రీనివాస్, పూర్వ అధ్యక్షుడు కేవీ చలం, వి.నాగేంద్ర ప్రసాద్, యోహాన్, వంకిన వెంకటేశ్వరరావు, దూలం శ్రీరామ్, విజయలక్ష్మి, అన్నపూర్ణ, మేరీ, ఇందిరా కుమారి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

పెంటపాడు: విద్యార్థి దశనుంచే పుస్తక పఠనం, గ్రంథాలయాల సందర్శనను అలవర్చుకోవాలని కేశవరం జెడ్పీస్కూలు హెచ్ఎం రామకృష్ణ పేర్కొన్నారు. పెంటపాడు శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని సామాజిక చైతన్యం పత్రికల పాత్రకు సంబంధించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. దేశ నాగరికత, చరిత్ర, ఆచార వ్యవహారాలు, వాణిజ్య, వ్యాపారాలు, తదితర విషయాల పట్ల సమగ్రసమాచారం పురాతన వస్తువుల వల్ల తెలుస్తుందన్నారు. వీటి ద్వారా ఎంతో విజ్ఞానాన్ని విద్యార్థులు పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆలీ, దిరుసుమర్రు హెచ్ఎం శైలజ, కె. సుధారాణి, కృష్ణవాసవి ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థులు, ఉద్యోగులు యశ్వంత్, వెంకట్ పాల్గొన్నారు.



పెంటపాడు: శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న విద్యార్థిని



ఇరగవరం: మాట్లాడుతున్న పలువురు వక్తలు

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ఇరగవరం: 57వ గ్రంథాలయ వారోత్సవాలు ఇరగవరంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని రేలంగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఉత్సవాల్లో భాగంగా సెల్‌ఫోన్ వినియోగంపై పలువురు వక్తలు మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించాలని తెలిపారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థులను కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే చదవడానికి పరిమితం చేస్తున్నారని, ఇది ప్రమాదకర ధోరణిగా మారుతుందని వక్తలు చెప్పారు. గ్రంథాలయాల్లోని అన్ని రకాల పుస్తకాలు చదవేలా చేయాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన, ఉత్సాహం కలిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు మనే భాస్కరరావు, అద్దాల మెంటరావు, సెక్రటరీ చేగొండి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



తణుకు టౌన్: మాట్లాడుతున్న డీవీవీఎస్ వర్మ



తాడేపల్లిగూడెం(టీఓసీ): మాట్లాడుతున్న వీరాస్వామి

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తణుకు టౌన్: సమాజాన్ని ఆధునిక దృక్పథంలో నడిపించేందుకు సాహిత్యం కృషి చేస్తుందని ప్రముఖ సామాజిక వేత్త డీవీవీఎస్ వర్మ చెప్పారు. తణుకులోని జిల్లా పురుషుల శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో జాతీయ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యం ద్వారానే సమాజ వికాసం పెరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన కవులు కోట రామప్రసాద్ బంగారు బాల్యం గురించి కవితను చదివి వినిపించారు. సాహితీ సామ్రాజ్యం సాహితీ సంస్థ వ్యవస్థాపకులు తాడినాడ భాస్కరావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కవిశ్రీ మోహనప్రసాద్, ఎస్ శ్రీనివాస్‌లు తమ కవితలను చదివి విన్పించారు. ఈకార్యక్రమంలో న్యాయవాది కొరు వెంకటేశ్వర్లు, గ్రంథాలయ అధికారి సుగుణకుమారి, జీ ఉష, పృధ్వీనారాయణ తదితరులు కవి సమ్మేళనంలో పాల్గొన కవులను, డీవీవీఎస్ వర్మలను సత్కరించారు. ఈకార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. తణుకు మహిళా గ్రంథాలయం ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాల సందర్భంగా ఆదివారం మహిళలకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈపోటీలలో మహిళలకు మెమొరీ గేమ్స్, ఒన్ మినిట్ గేమ్స్, బాల్ పాస్ ఆన్ గేమ్స్ మొదలైనవి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు. తణుకు మండల వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. పట్టణానికి ప్రముఖ రచయిత కానూరి బదరీనాథ్ విద్యార్థులకు పుస్తక పఠనం ఆవశ్యకతను వివరించారు. ఈకార్యక్రమంలో సీహెచ్ సత్యనారాయణ, తోట వెంకట్రావు, గుణ్ణం బసవయ్య, ఏ నాగలక్ష్మీ, అధికారి వై సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి: శాఖా గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

అత్తిలి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను చిన్నారులు తిలకించారు. ఈసందర్భంగా గ్రంథాలయాలు ఉపయోగాలు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రిటైర్డు గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు, ఉమా తేజస్వీ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, కమిటీ సభ్యులు ఎం శ్రీదేవి, డి నాగేంద్రవర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశభక్తి గీతాలు తప్పక నేర్చుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులు దేశభక్తి గీతాలు తప్పక నేర్చుకోవాలని పలువురు పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయంలో ఆదివారం పట్టణంలోని వివిధ స్కూల్స్ నుంచి హాజరైన విద్యార్థులకు దేశభక్తి గీతాలు పోటీలు జరిగాయి. ప్రత్తి వీరాస్వామి, కేవీ సూర్యప్రకాశ్, వి.జాన్‌బాబు, నున్న సత్యంలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో ఆరుగురు వృద్ధులకు వైద్య సేవలు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుత రామయ్యల ఆధ్వర్యంలో ఆరుగురు వృద్ధులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు అందించారు. కాకర్ల సీతా మహాలక్ష్మి ఆర్థిక సహాయాంతో మందులను ఉచితంగా అందజేశారు.

వత్సవాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

తణుకు: క్షత్రియ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వనసమారాదన కార్యక్రమంలో భాగంగా తణుకు క్షత్రియ కల్యాణ మండపంలో సాంస్కృతిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వత్సవాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరహాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీగేయరచయిత రసరాజు రచించిన క్షత్రియ గీతాన్ని గజల్‌శ్రీనివాస్ సంగీత దర్శకత్వంలో కాకరపర్తి కామేష్ నృత్యరూపంలో ప్రదర్శించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ వత్సవాయి వెంకటరాజు దంపతులు ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ కోడూరు ప్రభాకర్‌రెడ్డి రచించిన మీరాభజనలు గ్రంథాన్ని వత్సవాయి సత్యవతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి వెంకట కృష్ణారావు, పి.ధర్మరాజు, చివటం సుబ్బారావు, పీయూబీ శ్రీధర్, సుందరరావు పాల్గొన్నారు.

వెలుగులోకి పోలీసు పంచాయితీ..!

- గేదెల అపహరణ కేసులో చేతులు మారిన నగదు
- దొంగతో పోలీసులు చేతులు కలిపారంటూ ఆరోపణలు
- రూ.13 లక్షలు చేతులు మారిన వ్యవహారంపై విచారణ

తణుకు: రెండు గేదెలు అపహరణ కేసులో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారిందంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తణుకు రూరల్ పోలీసులు ఇందుకు సంబంధించి చేసిన పంచాయితీ వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని రెండు గేదెలను అపహరించిన కేసులో నిందితులతో పోలీసులు చేతులు కలిపి రూ. 13 లక్షలు చేతులు మారిందంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వ్యవహారంపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఆగస్టు నెలలో తన రెండు గేదెలను అపహరించినట్లు అత్తిలి మండలం బల్లిపాడు గ్రామానికి చెందిన ఆకుల మారుతీ అయ్యన్నరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అప్పట్లోనే రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. తణుకు మండలం వీరభద్రపురం గ్రామంలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్న బండి రామలింగేశ్వరరావు అలియాస్ ఈశ్వరరావు, దువ్వ గ్రామానికి చెందిన కోసూరి సతీష్, వీరబద్రపురం గ్రామానికి చెందిన దున్నా సోమరాజులపై అప్పటి పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే ఈ వ్యవహారంలో తణుకు రూరల్ పోలీసులు చేసిన పంచాయతీలో రూ.13 లక్షలు చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మధ్యవర్తుల సహకారంతో..

తణుకు మండలం వేల్పూరు గ్రామంలో ఈశ్వరరావుకు చెందిన స్థలాన్ని లీజుకు తీసుకుని అయ్యన్నరావు గేదెల ఫారం నడుపుతున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య విబేధాలు రావడంతో అయ్యన్నరావును దెబ్బ తీయాలనే ఉద్దేశంతో ఒకరోజు రాత్రి వ్యానులో గేదెల ఫారంలో రెండు గేదెలను ఈశ్వరరావు అపహరించుకుపోయాడు. దీనికి సంబంధించి యజమాని తణుకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా ఈశ్వరరావుతోపాటు తన అనుచరులు ఈ చోరీకు పాల్పడినట్లు నిర్ధారించి వీరిని అరెస్టు చేశారు. పోయిన గేదెలను రికవరీ చేయలేని పోలీసులు ఇద్దరు మధ్యవర్తుల ద్వారా యజమానికి నష్టపరిహారం ఇప్పించాలనే ఉద్దేశంతో ఇరువర్గాలు ఒప్పించారు. యజమానికి రూ. 5లక్షలు ఇచ్చిన పోలీసులు మిగిలిన సొమ్ములు మధ్యవర్తిత్వం వ్యవహరించిన వారు తమకు రావాల్సిన బాకీ రూపంలో జమ చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే చోరీకి పాల్పడిన నిందితుడు ఈశ్వరరావు వద్ద రూ.13 లక్షలు తీసుకున్న పోలీసులు తనకు కేవలం రూ. 5 లక్షలు మాత్రమే ఇప్పించారని బాధితుడు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది. అప్పట్లోనే ఈ కేసు రాజీఅయినట్లు ఇరువర్గాలు రాతపూర్వకంగా రాసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాజాగా గేదెల అపహరణ కేసులో రూ. 13 లక్షలు చేతులు మారినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండంతో ప్రస్తుతం ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. గేదెల అపహరణ కేసులో జరిగిన నగదు వ్యవహారం మొత్తం తణుకు రూరల్ సర్కిల్ కార్యాలయం చుట్టూ జరిగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై బదిలీపై వెళ్లిన సీఐ కీలకంగా వ్యహరించినట్లు సమాచారం.